
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 28 ఆగస్టు 2024



షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి..

- 3.71లక్షల మంది రైతులకు గాను 1.15లక్షల మందికే మాఫీ జరిగింది..
- రైతుల సంఖ్యను కుదింపు చేయటం సరికాదు
- రైతు సంఘాల నేతల డిమాండ్
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘాలు

ఖమ్మంటౌన్, ఆగస్టు 27: రెండు లక్షల రూపాయలు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షరతులు లేకుండా గడువులోపు రుణమాఫీ పూర్తిచేయాలని కోరుతూ రైతులు, రైతుసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శనరావు, తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావులు మాట్లాడుతూ రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవోనెంబర్ 567లో అనేక నిబంధనలు విధించటం వల్ల రైతులు రుణమాఫీ పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల సంఖ్యను కుదింపు చేయటం సరికాదని, షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 3.71లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా గుర్తించినా, కేవలం 1.15లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీలో తెల్ల రేషన్‌కార్డు నిబంధనను ఎత్తివేయాలని, రూ.2లక్షలకు పైగా రుణం ఉన్నదానితో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని సుదర్శనరావు, హేమంతరావు డిమాండ్ చేశారు. పహణీ నకళ్లమీద రుణం తీసుకున్నవారికి (మిగతా 6వ పేజీలో)

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..

- రుణమాఫీ ప్రక్రియ ఇంకా మధ్యలోనే ఉంది...
- మిగిలిన రూ.18వేల కోట్లు సర్వే ద్వారా జమచేస్తాం
- వారం, పది రోజుల్లో సర్వే పూర్తి చేస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రుణమాఫీ ప్రక్రియ మధ్యలో ఉందని, ఇంటింటి సర్వే ద్వారా రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వారం, పదిరోజుల్లో సర్వేపూర్తి చేసి యాప్‌ద్వారా వారికి రుణమాఫీ వర్తింపచేస్తామన్నారు. మిగిలిన రూ.18వేల కోట్ల రుణమాఫీ సొమ్ము తప్పకుండా జమచేసి తీరుతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద సీపీఎం, సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా వద్దకు చేరుకున్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లుగా 42లక్షల మంది రైతులకు సంబంధించి రూ.2లక్షలలోపు మొత్తం రూ.31వేల కోట్ల రుణబాకీ ఉందని తెలిపారు. ఆయా బ్యాంకులు ఇచ్చిన జాబితాల ప్రకారంగానే దశలవారీగా రైతురుణమాఫీ చేస్తున్నామని తెలిపారు.

ఇప్పటికీ రాష్ట్రంలో రూ.2లక్షలలోపు రుణాలున్న 22లక్షలమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాఫీ నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.18వేల కోట్లు జమ చేయాల్సి ఉందన్నారు. ఇంటింటి సర్వే ద్వారా



రైతుసంఘాల ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారణ చేసి యాప్ ద్వారా పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రూ.2లక్షలపైన బకాయి ఉన్న రైతులకు సంబంధించి సుమారు 12వేల మంది రైతులున్నారని, త్వరలో మంత్రివర్గ సమావేశంలో రూ.2లక్షలపైబడి ఉన్న రైతులకు సంబంధించి రూ.2లక్షల వరకు రుణమాఫీ విషయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా రుణమాఫీ చేస్తే కాగ్ తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. అటువంటి తప్పుడు పనులు తమ ప్రభుత్వం చేయదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షలలోపు రూతు రుణ బకాయిని తప్పక అందిస్తామన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారం, పదిరోజుల్లో ఈ సర్వే ప్రక్రియ పూర్తవుతుందన్నారు.



దళారులే సూత్రధారులు

- సీఎంఆర్ఎఫ్ దొంగ బిల్లుల తయారీలో వీరిదే కీలకపాత్ర
- ఇన్‌పేషంట్ ఐడీ నెంబర్లతో పేర్లు మార్చి బిల్లుల తయారీ
- కొన్నిచోట్ల బిల్లులపైనే పేర్లు మార్చిన వైనం


ఖమ్మం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పేదల వైద్యానికి సాయం అందించే ముఖ్యమంత్రి సహాయనిధి పథకం (సీఎంఆర్ఎఫ్)లో ప్రైవేటు ఆస్పత్రుల దొంగబిల్లుల వ్యవహారంలో కొందరు దళారులు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిసింది. ఖమ్మంలో సుమారు 19 ప్రైవేటు ఆస్పత్రులను ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టిన విషయం విదితమే. అయితే ఇందులో కొన్ని ఆస్పత్రులు తమ ఏజెంట్ల ద్వారా దొంగబిల్లులు సృష్టించి దరఖాస్తుచేయగా, కొందరు దళారుల ఆయా ఆస్పత్రుల పేరుతో దొంగబిల్లులు తయారుచేసి ప్రజాప్రతినిధుల ద్వారా సాయం పొందేందుకు సిఫార్సులు పొందినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

గతంలో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ఎక్కువగా ఈతరహాలో డబుల్‌బిల్లులు వెళ్లడంలో సీఎం పేషీలో ఈ విభాగం చూసే అధికారులు ఖమ్మం ప్రైవేటు ఆస్పత్రుల్లో దొంగబిల్లుల దందాను పసిగట్టి కేసులు నమోదు చేయించారు. ఈ దందాపై సీఐడీ విచారణ సాగిస్తున్నది. అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం ప్రైవేటు ఆస్పత్రుల్లో పేషంట్‌గా జాయిన్ అయి డిశ్చార్జి అయిన వారి కేస్ షీట్ ఆధారంగా పేషంట్ ఐడీ నెంబరు ఉంచి పేర్లు మాత్రమే మార్చి కలర్ జిరాక్సులు తీయించారు ఈ బిల్లులను ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు చేయించారు. సీఎం పేషీలో పేషంట్ ఐడీని ఆన్‌లైన్‌లో తనిఖీ చేసినప్పుడు ఆస్పత్రిలో ఐడీ నెంబరు పేరులో.. ప్రజాప్రతినిధుల సిఫార్సుతో వచ్చిన సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు పేరులో తేడాలున్నాయి. ఒకే ఐడీ నెంబరు పేరుతో కొందరు వేర్వేరు బిల్లులు పెట్టగా, కొందరు తప్పుడు బిల్లులు పెట్టారు. ప్రైవేటు ఆస్పత్రులల్లో ఇన్‌పేషంట్ నుంచి డిశ్చార్జి పేషంట్ వరకు కేస్ షీట్‌లో వివరాలుంటాయి. ఈ కేస్‌షీట్‌ను, ఆస్పత్రి పేమెంట్ బిల్లును కొందరు లెటర్‌ప్యాడ్లపై సొంతంగా చేయించారు.

కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆన్‌లైన్ బిల్లులు కూడా ఇవ్వకుండా తమ లెటర్ ప్యాడ్లపైనే పేమెంట్ వివరాలను చెబుతూ కంప్యూటర్ ద్వారా బిల్లులు తయారు చేయించి ఆస్పత్రి ముద్ర, డాక్టర్ల సంతకాలు పెట్టడం చేస్తున్నారు. దీన్ని కూడా దళారులు కాపీ కొట్టి దొంగబిల్లులు పెట్టి సీఎం పేషీలో చక్రం తిప్పి సొమ్ములు చేసుకోగా, కొన్ని పట్టుకుని వెనక్కి పంపారు. ఇలా ఏ ఆస్పత్రుల పేరిట బిల్లులు వచ్చాయో ఆ ఆస్పత్రులను బ్లాక్‌లిస్టులో పెట్టడం జరిగింది. ఖమ్మం కేంద్రంగా కొన్ని ఆస్పత్రుల యజమానులు, కొందరు దళారులు ఆర్ఎంపీల పాత్ర ఉన్నట్టు తెలిసింది. కలర్‌జిరాక్సుల ద్వారా లెటర్‌ప్యాడ్లు, బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్‌కు పంపడంతో ఈ వ్యవహారం బయటకుపొక్కిది. దీనిపై పూర్తిస్థాయి విచారణ అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్ వ్యవహారం బహిర్గతం కానుంది. అయితే ఆస్పత్రుల యజమానులతో పాటు తప్పుడు బిల్లులు దరఖాస్తు చేసి తప్పుడు ఇన్‌పేషంట్ ఐడీలతో బిల్లులు సృష్టించిన దళారులు, దరఖాస్తుదారులపై కూడా పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తే వాస్తవాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది. విచారణలో ఏం జరుగుతుందో చూడాలి.

దోమ.. నగరవాసుల్ని కుదురుగా కూర్చోనివ్వడం లేదు.. సరికదా కంటిపై కునుకు పట్టనివ్వడం లేదు. నగరంలో నిత్యం 10 కేసులకు తగ్గకుండా జ్వరపీడితుల సంఖ్య నమోదవుతుండడానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. వీరిలో సింహభాగం బాధితులు మురికివాడలకు చెందిన వారే. డెంగ్యూ, ఇతర జ్వరపీడితుల సంఖ్య ప్రైవేటు ఆస్పత్రుల్లో అధికంగానే ఉంటోంది. నగరపాలక సంస్థ దోమల నివారణ కోసం ఏటా రూ. 2.50 కోట్లలో వెచ్చించినా ఫలితం ఉండడంలేదు. వాటిని నిర్మూలించే విషయంలో ప్రజల్లో తగిన అవగాహన లేక వాటి బారి నుంచి తప్పించుకునేందుకు వివిధ మార్గాల్లో ఏటా మరో రూ.12.5 కోట్ల వరకూ ఖర్చుచేస్తూ దోమకాటుతో పాటు ఆర్థిక పోటుకు గురవుతున్నారు.

- దోమల బారి నుంచి రక్షించుకునేందుకు జనం చేస్తున్న ఖర్చు రూ.12.50 కోట్లు
- జ్వరాల బారిన పడితే వైద్యానికి పెట్టే ఖర్చు అదనం
- ఇది ఒక్క ఖమ్మం నగర పరిధిలోని లెక్క మాత్రమే...
- ఫలితాలివ్వని డ్రై డే కార్యక్రమాలు
- ఫొటోలకు పోజులే తప్ప చిత్తశుద్ధి కరవు
- సామాన్యులను బెంబేలెత్తిస్తున్న వానాకాలం సీజన్



వామ్మో.. దోమ!

నిర్మూలనకు ఏటా రూ.2.50 కోట్లు వెచ్చిస్తున్న నగరపాలక సంస్థ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 27: ఇటీవల నగరంలో దోమల బెడద తీవ్రరూపం దాలుస్తోంది. నగరంలో, పరిసరాల్లో నెలకొన్న పరిస్థితులే దీనికి ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు పలు నివారణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల్లో అవగాహన లేకపోవడం వీటి తీవ్రత తగ్గుముఖం పట్టడంలేదు. వాస్తవానికి దోమలను నివారించే చర్యలు జూన్ నెల నుంచే ప్రారంభం కావాలి. వర్షాకాలంలో పాటు శీతాకాలంలోనూ దోమలు ఎక్కువ గానే ఉత్పత్తి అవుతాయి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోవడం, చెత్తా చెదారాలను విచ్చలవిడిగా పారబోస్తుండడంతో వీటి తీవ్రత పెరుగుతోంది. స్వచ్ భారత్, ఫ్రైడే డ్రైడే లాంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి నగర ప్రజలు సరైన అవగాహన కల్పించుకొని పరిసరాలను శుభ్రం చేసుకోకుంటే ఆరోగ్యం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోక తప్పని పరిస్థితులు దాపురించాయి.

ఇవీ కారణాలు..

నగరంలో దోమణ నిర్మూలకు నగరపాలక సంస్థ ఏటా రూ. కోట్లు వెచ్చిస్తోంది. మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో నిల్వ ఉండే మురుగునీటి గుంటలు దోమలను ఉత్పత్తిచేస్తూ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. దీంతోపాటు. నగరంలో భూగర్భ కాల్వల వ్యవస్థ సక్ర మంగా లేకపోవడం, ఉన్న కాల్వలు సరైన నిర్వహణ లేక పూడుకుపోవడం కూడా మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఖాళీ ప్రదేశాల్లో ఏర్పడిన మురుగు నీటి గుంటలు, అడవుల్లా పెరుగుతున్న పిచ్చిమొక్కలు కూడా తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఫలితంగా రకరకాల దోమ కాటుకు గురై నగర ప్రజలు పెద్ద సంఖ్యలో ఏటా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, విషజ్వరాల బారిన పడి ఆరోగ్యం. ఆర్థికంగా ఇళ్లు ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

లార్వా దశలోనే చర్యలు

ప్రజారోగ్య విభాగం అధికారులు ఎప్పటికప్పు డు క్షేత్రస్థాయిలో యాంటీ లార్వాల్ ఆపరేషన్లు నిర్వహించి గుడ్డు, లార్వా, ప్యూపా దశలోనే దోమ పెరగకుండా ప్రత్యేక నివారణ చర్యలు తీసుకోవా లి. లేని పక్షంలో ఎంత మొత్తంలో రసాయనాలు వాడినా, నిల్వ ఉంచినా ప్రయోజనం ఉండదు.

రసాయనాల కొనుగోళ్లు ఇలా..

ఈ ఏడాది ప్రభుత్వం దోమల నిర్మూలన కోసం ఎంఎల్ ఆయిల్, ఎబెట్‌ను సర్కారు సరఫరా చేసింది. పైరత్రం కూడా అందించింది. ఫాగింగ్ కోసం వినియోగించే మలాథియాన్ కిలోల మేరకు సరఫరా చేసింది. నగరపాలక సంస్థ అధికారులు కూడా ఈసారి ఇతరత్రా రసాయనా లను సైతం వాడుతున్నారు.

దోమలు.. వ్యాధులు

ఎనాఫిలిస్ దోమ కుడితే మలే రియా జ్వరం సంక్రమిస్తుంది. ఎడిస్: దోమ కాటేస్తే ప్రమాదకరమైన డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు. సోకుతాయి. క్యూలెక్స్ దోమకాటు వల్ల బోదకాలు వస్తుంది. జేఈ దోమ కుట్టిన పక్షంలో మెద దువాపు వ్యాధి సంక్రమిస్తుంది. అయితే పందులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే ఇటువం టి దోమలవల్ల ప్రమాదం ఉంటుంది.

ఇలా చేస్తే బాగు..

దోమలను లార్వాదశలోనే నిర్మూలించేందుకు ప్రజల్లో తగిన అవగాహన కావాలి. ఇళ్లల్లో, ఇంటి ప్రాంగణాల్లో, ఖాళీ స్థలాలోనూ వర్షపునీరు, ఇతరత్రాల వాడుక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చిన్నపాటి గుంటలను కూడా పూడ్చుకోవాలి. పాతటైర్లు పూల కుండీలు, ట్యాంకులు, ఇతర పాత్రల్లో నీరు రోజుల తరబడి నిల్వ ఉండకుండా తగిన ఏర్పాటు చేసుకోవాలి. ఇక వ్యర్థాలను క్యారీబాగుల్లో చుట్టి డ్రెయిన్లలో పడేసి మరుగునీరు పారుదలకు ఆటంకం కలిగించే చర్యలను మానుకోవాలి. ఫలితంగానే దోమల నిర్మూలన సులువు అవుతుంది.

నెలకు లక్షల్లో ఖర్చు...







దోమల నివారణా సాధనాలు సగటు కుటుంబాల ఇంటి బడ్జెట్లో భాగమయ్యాయి. నెల వారీ కొనుగోలు చేసే పచారీ సరకుల జాబితా లో చేరాయి. దోమల నిర్మూలకు నగరపాలక సంస్థ ఏటా రూ.కోట్లలో వ్యయం చేస్తుండగా, నగర ప్రజలు సైతం వాటి భారీ నుంచి తప్పించుకునేందుకు ఏడాదికి రూ. కోటి పైనే (నిత్యం రూ.లక్షల్లో) వెచ్చిస్తున్నారు. దోమల నిర్మూలనా సాధనాలైన లిక్విడ్ బాటిల్స్ చక్రాలు, ఈజీ ఫాయిల్, హిట్ వంటి పిచికారి, బాట్స్, దోమతెరలు వాడుతూ పెద్దమొత్తంలో ఖర్చు చేస్తున్నారు. నగరంలో దాదాపు 2లక్షల కుటుంబాలు ఉండగా అందులో 97వేల కుటుంబాలు దోమలను నిర్మూలించేందుకు కింది పద్ధతులను వినియోగిస్తున్నారు. వాటి కోసం వెచ్చిస్తున్న మొత్తాలు అంచనాల్లో...

దోమలను నిర్మూలించేందుకు నగరంలోని దాదాపు 20 వేల కుటుంబాలు వివిధ సంస్థలకు చెందిన పలు రకాల లిక్విడ్ బాటిల్స్‌వాడుతూ నెలకు సగటున రూ.30 లక్షలు వెచ్చిస్తున్నారు. నగరంలోని 30 వేల కుటుంబాలు పలు సంస్థలకు సంబంధించిన కాయిల్స్, మ్యాట్లు వినియోగిస్తూ రోజుకు 1.20 లక్షలు చొప్పున నెలకు రూ.36 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వివిధ సంస్థలు కొత్తగా మార్కెట్లో విడుదల చేసిన ఈజీఫాయిల్ వంటి వాటిని నిత్యం 25వేల మంది వినియోగిస్తూ రోజుకు రూ.25 వేలు(నెలకు రూ.7.50 లక్షలు) వెచ్చిస్తున్నారు. పలు సంస్థలకు చెందిన పిచికారి దోమల మందులను నిత్యం 10 వేల మంది వాడుతూప్రతీ 15 రోజులకు వారు రూ.8 లక్షల (నెలకురూ.16 లక్షలు) వరకు ఖర్చు చేయాలి వస్తోంది. మరో 5వేల మంది చార్జింగ్ బ్యాటరీ తోకూడిన బ్యాట్లను కొనుగోలు చేస్తూ ప్రతీ ఆర్నెల్లకు రూ.7.50 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. నగరంలోని 2 నుంచి 4వేల మంది ఏటా రూ.6 లక్షలు వెచ్చిస్తూ దోమ తెరలపై ఆధారపడుతున్నారు. ఉన్నత వర్గాలకు చెందిన వారు తమ ఇళ్లకు మ్యాట్లు బిగించేందుకు పెద్దమొత్తంలో వ్యయం చేసుకుంటున్నారు. నగరంలో నాలుగు పట్టణ పీహెచ్‌సీల్లో ఇప్పటి వరకు 43 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి.



ఘటన స్థలం వద్ద పోలీసులు, స్థానికులు

వెలుగుమట్లలో ఉద్రిక్తత

- స్థలం వివాదంపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ
- కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల మోహరింపు

ఖమ్మంక్రైం, ఆగస్టు 27: ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల రెవెన్యూలోని ఓ స్థల వివాదంపై మంగళవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వ్యక్తులు తమ భూమి అని, కాదుకాదు ఇది భూదాన్ భూమి అంటూ మరికొందరు ఆక్రమణలకు దిగి షెడ్లు నిర్మించుకోవడంతో ఇక్కడ వివాదం నెలకొంది. ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూమి అంటూ వారు కోర్టుకు వెళ్లగా.. ఖాళీచేయించాలని పోలీసుల సహకారంతో స్థలం వద్దకు మంగళవారం వచ్చారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది.

ఖాళీచేయించేందుకు అక్కడకు చేరుకున్న పోలీసులు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో షెడ్లను తొలిగించే ప్రయత్నం చేయగా నివాసం ఉంటున్న వారు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ప్రైవేటు స్థలం యజమానులకు షెడ్లలో నివాసం ఉంటున్న వారికి మధ్య ఘర్షణ తలెత్తండతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలకు రాళ్లు రువ్వుకోవడంతో ఓ మహిళ తలకు గాయమైంది. స్థానికులు ప్రైవేటు భూమి అంటున్న వారి తరఫు వారిపై కర్రలతో దాడి చేయగా ఓవ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. పోలీసుల సహనంతో ఘర్షణనివారించారు. ప్రైవేటు భూములని వారసత్వంగా వస్తున్నాయని, ప్రభుత్వానికి గ్రీన్‌బెల్ట్‌కు ల్యాండ్ ఇవ్వడం జరిగిందని, తమభూమిని ఆక్రమించి షెడ్లు వేసుకున్నారని స్థల యజమానులు పేర్కొన్నారు. ఎకరన్నరం భూమిని ఆక్రమించుకుని షెడ్లు వేసుకున్నారని, తాము చట్టం ప్రకారం న్యాయప్రకారం నోటీసులు ఇచ్చి కోర్టు ఆదేశాల ప్రకారంగా భూమి వద్దకు వచ్చామని తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమపైకి దాడికి దిగుతున్నారని పేర్కొన్నారు.

కాగా ఇది భూదాన్ భూమి అని, మేం కూడా కోర్టుకు వెళ్లాం త్వరలో తీర్పు వస్తుంది. అప్పటి వరకు ఆగాలంటూ షెడ్లలో నివాసం ఉంటున్నవారు ఘర్షణకు దిగారు. పోలీసులు మీదగ్గర ఎటువంటి కాగితాలు లేవు. రికార్డులు లేవు. కోర్టునుంచి ఖాళీచేయించాలని ఆదేశాలు రావడంతో మేము వచ్చామని, ఖాళీచేయాలని సూచించారు. అందుక వారు అంగీకరించలేదు. అక్కడే కర్రలతో కూర్చున్నారు. వారిని ఖాళీచేయించేందుక పోలీసులు ప్రయత్నించినప్పటికి ఫలించలేదు. ఎక్స్‌వేటర్‌ను అడ్డుకోవడంతో వెంటపడడంతో పోలీసులు వెళ్లిపోయారు. కొంతమంది షెడ్లను తొలిగించే ప్రయత్నం చేయగా షెడ్ల యజమానులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడడంతో తొలగింపును తాత్కాలికంగా నిలిపివేశారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్...

బీఆర్ఎస్ సంబురాలు

ఖమ్మం టౌన్, ఆగస్టు 27: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంతో జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ మాట్లాడుతూ న్యాయమే గెలిచిందని, సుప్రీంకోర్టు రాజ్యాంగ విలువలను కాపాడిందన్నారు. కవితపై కుట్రతో లిక్కర్‌పాలసీ సాకుతో అక్రమంగా కేసులు పెట్టారని, ఇందులో నిజాలు లేవని బీఆర్ఎస్ మొదటినుండి చెబుతూనే ఉందన్నారు. కవితకు బెయిల్ బీఆర్ఎస్ సాధించిన నైతిక విజయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బెల్లం వేణు, వీరన్న, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్,ఆసిఫ్, సందీప్, నాయకులు సద్దాం,మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాద్రిలో ఘనంగా

కృష్ణ జన్మాష్టమి వేడుకలు

- స్వామి వారికి ఊంజల్‌సేవ
- తొమ్మిది ప్రత్యేక ప్రసాదాలతో నివేదన



స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వైదికులు

భద్రాచలం, ఆగస్టు 27: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత దర్బారు సేవ నిర్వహించి తరువాత ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ సమయంలో భాగవతంలోని శ్రీ కృష్ణ జనన ఘట్టాన్ని స్థానాచార్యులు కేఈ స్థలశాయి వివరించారు. అనంతరం శ్రీ కృష్ణునికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి లాలలు, జోలలు నిర్వహించారు. ఈ సమయంలో తొలుత సతులార ఓ సతులార, సతులార చూడరే శ్రావణ బహుళాష్టమి, రారా నా వెన్న ముద్ద గోపాలా, ముద్దుగారే యశోద ముంగిట ముత్యం వీడు, కృష్ణం కలయ సఖి సుందరం తదితర కీర్తనలను దేవస్థానం హరిదాసులు గానం చేశారు. ఈ క్రమంలో కాయం, వెన్న, పాలతో పాటు తొమ్మిది రకాల ప్రత్యేక ప్రసాదాలను స్వామివారికి నివేదన చేశారు. చివరగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉట్ల పండుగను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలతో జీవనోపాధి

- ఐటీడీఏ పీవో రాహుల్
- సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచన
- ఎంఎస్ఎంఈ యూనిట్ల పరిశీలన




భద్రాచలం, అశ్వాపురంలో యూనిట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం/బూర్గంపాడు/అశ్వాపురం/మణుగూరు, ఆగస్టు 27: ఆదివాసీ గిరిజన మహిళలు సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ద్వారా స్వశక్తితో జీవనోపాధి పెంపొందించుకుంటున్న మహిళలు గృహ అవసరాలకు వస్తువులు తయారు చేసుకోవడానికి సొంతంగా ముడి సరుకులు కొనుగోలు చేసి వాటిని బయట మార్కెటింగ్ చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలంలోని ఎంఎస్ఎంఈ యూనిట్ ద్వారా సబ్బులు, షాంపులు తయారు చేసే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. షాంపూలు, సబ్బులు వాడుతున్న ముడి పదార్థాల గురించి మహిళలను పీవో అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు వీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీ భాస్కర్, జీసీసీ డీఎం దావీద్ పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలతో జీవనోపాధి పెంపొందించుకోవడం అభినందనీయం

బూర్గంపాడు: గిరిజన మహిళలు సొసైటీగా ఏర్పడి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకుని జీవనోపాధి పెంపొందించుకోవడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఎంఎస్ఎంఈ యూనిట్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన జై జగదాంబ మేరమ్మ యాడి రెడీమేడ్ ప్రభుత్వ మగ్గం కేంద్రాన్ని పీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది మంది మహిళలు సొసైటీ ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పెంపొందించుకోవడం అభినందించ దగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ భాస్కర్, ఏపీఎం నాగార్జున, రామ్‌కుమార్, మగ్గం కేంద్రం యజమానురాలు తానుబాయ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

అశ్వాపురం: నిరుద్యోగులైన గిరిజన యువత, రైతులకోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమపథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించుకుని, కుటుంబాలను పోషించుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో ఎంఎస్ఎంఈ యూనిట్‌ద్వారా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించుకుని జీవనోపాధి పొందుతున్న వారి పరిశ్రమలను సందర్శించి లబ్ధిదారులతో పీవో మాట్లాడారు. గ్రామంలో ఆదిదేవర డెకరేషన్ ఫొటోగ్రఫి కేంద్రాన్ని, సమ్మక్క-సారక్క కందిపప్పు కేంద్రాన్ని పరిశీలించారు. పీవో మాట్లాడుతూ పరిసర గ్రామాల్లో దొరికే కందిపప్పును సేకరించి ఈ కేంద్రం ద్వారా సగం జీసీసీకి, సగం మార్కెటింగ్ చేసుకుని కేంద్రాన్ని అభివృద్ధిపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఓ భాస్కర్, రామ్‌కుమార్, రాజేష్, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలి

మణగురు రూరల్: గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడమే కాక ప్రభుత్వం కల్పిస్తున్న చిన్న తరహా పరిశ్రమల్లో చేపల పెంపకంతో జీవనాధారం పెంపెంపొందించుకుని పదిమందికి ఉపాధి కల్పించడం సంతోషకరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికార బి.రాహుల్ అన్నారు. మంగళవారం మణుగూరు మండలంలోని సాంబాయిగూడెం గ్రామంలో ట్రైబల్ ఫిసరీస్ కోఆపరేటీవ్ సొసైటీ ద్వారా చేల పెంపకంతో జీవనాధారం పొందుతున్న గిరిజన రైతుల చేపల చెరువును ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సుక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ద్వారా వారి గ్రామాంలోని చెరువులోని చేపలు మట్టి వాటిని అమ్ముకుని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. చేపలు అమ్ముకోడానికి బీటీపీఎస్ దగ్గర మార్కెట్ సౌకర్యం కల్పించాలని, చేప పిల్లలు పెంపకానికి చిన్న కుంటలు లాంటి ఏర్పాటు చేసు కోవడానికి ఆర్థిక సహాయం అందించాలని వారు పీవోను కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌వో భాస్కర్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, రాంకుమార్, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో సూత్రధారుల అరెస్ట్

ఖమ్మంక్రైం, ఆగస్టు27: గంజాయి కేసులో ఉన్న ఇద్దరు సుత్రదారులను అరెస్ట్ చేసినట్టు టౌన్ ఏసీపీ రమణమూర్తి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏప్రిల్‌లో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా 32కేజీల తరలిస్తుండగా ఇద్దరిని అప్పుడే అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఆ కేసులో సూత్రదారులుగా ఉన్న హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన చురమణ్‌వాలే సందు సింగ్, చురమణ్‌వాలే విష్ణు అలియాస్ మిస్సల్‌ను విశ్వసనీయ సమాచారం మేరకు రైల్వేస్టేషన్ వద్ద వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. గంజాయి సరఫరా చేసినా. విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ప్రకటనలో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ పంచాయతీ ఉద్యోగి మృతి

రఘునాథపాలెం, ఆగస్టు 27: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన గ్రామ పంచాయతీ ఉద్యోగి చికిత్స పొందుతూ కన్నుమూశారు. బూడిదంపాడు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న రాచబండి కోటేశ్వరరావు(44) కుటుంబ కలహాలతో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కోటేశ్వరరావును ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- నూతన జాతీయ విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- ఏపీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నేలకొండపల్లి, ఆగస్టు 27: ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గుదిబండలా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్‌లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో ఓ సెమినార్‌లో పాల్గొనటానికి వెళ్తూ నేలకొండపల్లి రావెళ్లభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడారు. 2004 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓపీఎస్ కొనసాగింది. కానీ దాన్ని రద్దు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇటీవలనే కేంద్రం యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీం)అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని కూడా వ్యతిరేకిస్తున్నాం. ఓపీఎస్, యూపీఎస్‌లను వ్యతిరేకిస్తున్నాం. దాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్నే ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లో ఓపీఎస్‌ఎస్‌ను అమలు చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీచేయాలని ఉద్యమించాలని నిర్ణయించుకున్నట్లు లక్ష్మణరావు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రావెళ్ళ అరవిందకుమార్, తొర్తి గురవయ్య, నాయకులు ఏటుకూరి రామారావు, వల్లూరిపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు భక్తరామదాస ధ్యాన మందిరం, బౌద్దస్థూపంలను సందర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

ఇంగ్లీష్ బోధన మెరుగుపరచాలి

- విద్యాశాఖ అధికారులతో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు బోధన మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో ఇంగ్లీష్ బోధనపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలన్నా రు. ప్రతీ పాఠశాలలో అన్ని తరగతుల వారికి అర్థగంట క్రీడలకు, అర్థగంట ఇంగ్లీష్ బోధన ఎంపిక చేసిన తరగతుల వారికి తప్పక ప్రతిరోజు కేటాయించాలని, ఈ దిశగా రోజువారి టైం టేబుల్ రూపకల్పన చేయాలన్నారు. తరగతిలో సంభాషణ పూర్తిగా ఇంగ్లీష్‌లో జరిగేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి, గ్రామర్ దోషాలున్న ఇంగ్లీష్‌లో మాట్లాడగలిగేలా ప్రోత్సహించాలన్నారు. తెలుగు మీడియం చదివి, తెలుగు ప్రాధాన్యంతో ఉన్న ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌పై పట్టు కలిగేలా శిక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు వాటిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, ఇంగ్లీష్ మాధ్య మంలో విద్యార్థులను తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్పి ప్యానెళ్లను ఇంగ్లీష్ పై పిల్లలకు ఉత్సాహం కలిగేలా మంచి కంటెంట్ గల గేయాలు, చిత్రాలు ప్రదర్శించి వారి దృష్టిని ఇంగ్లీష్ పై మళ్లించేలాచూడాలన్నారు. నియోజకవర్గానికి ఒక పాఠశాలను ఎంపికచేసి, ప్రయోగాత్మకంగా ఒక ఇంగ్లీష్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భాష అనేది ఒక ఆయుధమని, ఈ దిశగా ఇంగ్లీష్ భాష పిల్లలు నేర్చుకోవాలనే ఆకాంక్ష కలిగేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డీఈవో సోమశేఖరశర్మ, ఏఎంఓ జి. రవి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జగదీష్, రామనాథం, వసంత, ఎస్. రవి తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా

రుణమాఫీ చేయాలి

- రైతు సంఘాల నేతల డిమాండ్
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా

(5వ పేజీ తరువాయి)

, అలాగే గతంలో పాస్‌పుస్తకం ఉండి, ప్రస్తుతం పాస్‌పుస్తకం లేని రైతులకు కూడా రుణమాఫీ వర్తింప చేయాలన్నారు. రుణమాఫీ కోసం రైతులు వ్యవసాయపనులు వదిలిపెట్టి, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణాలు చేసే దుస్థితి నెలకొందన్నారు.షరతులు లేకుండా వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, తెలంగాణరైతుసంఘం అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు,తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, నాయకులు ఎండీ. మౌలానా, పొన్నం వేంకటేశ్వరరావు, బండి రమేష్, మీరా, భూక్యా వీరభద్రం,తమ్మిశెట్టి వేంకటేశ్వరరావు, గొడవర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.2వేల కోసం పరస్పర దాడులు

కామేపల్లి, ఆగస్టు 27: రూ.రెండు వేల కోసం ఒకరిపై ఒకరు దాడి చేసుకొని గాయాలు పాలైన సంఘటన కామేపల్లి మండల పరిధిలోని మద్రిగూడెం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మద్రిగూడెం గ్రామానికి చెందిన కిలారు శ్రీను అనే రైతు సాతానిగూడెం గ్రామంలోని శ్రీశ్రీనివాస ఫర్టిలైజర్ షాపులో పురుగుమందులు కొనుగోలు చేశాడు. అందులో కొంత మొత్తం ఇచ్చి మిగత రూ.2వేలు ఇవ్వడంలో జాప్యం చేశాడు. ఈ విషయంపై రెండు రోజులు క్రితం ఇరువురు కూర్చొని మాట్లాడుకున్నారు. మంగళవారం ఇస్తానని చెప్పడంతో షాపు యాజమాని, గుమస్తా మరో నలుగురు శ్రీను ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దుర్భషలాడుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో శ్రీను భార్యకు, షాపు గుమస్తాకు గాయాలు అయ్యాయి. చికిత్స నిమ్మిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

రాష్ట్ర ఖజానాకు ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం

- ఇప్పటికే దరఖాస్తు ఫీజుల రూపేణ రూ.4కోట్ల వసూలు
- సెంట్రల్ బ్యాంకు అకౌంట్‌లో జమ
- కేఎంసీకే కేటాయించాలంటున్న కార్పొరేటర్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 27: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని జనాబా ప్రాతిపదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మూడు నెలలకోసారి నిధులు మంజూరు చేస్తాయి. గత కొన్ని నెలలుగా నిధులు మంజూరు కాకపోయినా కేఎంసీలో ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, వ్యాపారులు చెల్లిస్తున్న కమిర్షియల్ ట్యాక్స్‌లతో కేఎంసీ నిర్వాహణ ఇబ్బంది లేకుండా నడుస్తోంది. అయితే ఖమ్మం నగర పాలక సంస్థకు ఆర్థిక వరంగా ఎల్‌ఆర్‌ఎస్ వరంగా మారుతుందని అధికారులు భావించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సమయంలో ప్లాట్‌లకు రూ.1,000, లే అవుట్‌లకు రూ.10,000 లు చార్జీ చేశారు. వీటి ద్వారా రూ.4కోట్ల మేరకు ఆదాయం వచ్చింది. అయితే దరఖాస్తుల డబ్బులను స్థానిక కేఎంసీ ఎల్‌ఆర్‌ఎస్ బ్యాంకు ఎకౌంట్‌కు కాకుండా నేరుగా రాష్ట్ర స్థాయిలోని సెంట్రల్ ఎకౌంట్‌కు జమ చేశారు. దీంతో రూ. 4 కోట్లు నిధులు రాష్ట్ర ఖజానాకు చేరాయి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి సందర్భంగా దరఖాస్తుదారుల నుంచి వచ్చే ఆదాయాన్ని కూడా రాష్ట్ర ఖజానాకు పంపాలని రాష్ట్ర అధికారులు ప్లానింగ్ విభాగానికి సూచించటంతో ఖమ్మం నగర పాలక సంస్థ ఆదాయంపై ప్రభావం పడింది. 2016లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సమయంలో కేఎంసీలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఆదాయం జమ చేసి స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించారు. ఇప్పుడు కూడా కేఎంసీకి ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం ఉండాలని కార్పొరేటర్లు కొరుతున్నారు.

సింగిల్ హ్యాండ్ ఎల్‌ఆర్‌ఎస్

- లెవల్ 1లో అమలు కాని నూతన నిబంధనలు
- క్షేత్రస్థాయి పరిశీలనలో రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖలు దూరం
- దరఖాస్తుదారులకు మూడు సార్లు తప్పని తిప్పలు



జీపీఎస్ ట్యాగింగ్ చేస్తున్న కేఎంసీ ప్లానింగ్ ఉద్యోగి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 27: అనధికారిక స్థలాలను క్రమబద్ధీకరణ చేయటంలో ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ లో ఎంతో కీలకమైన లెవల్ 1 పరిశీలనలో ఖమ్మం నగర పాలక సంస్థ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఉమ్మడిగా పరిశీలన చేసిన తర్వాతనే ఎల్‌ఆర్‌ఎస్ లెవల్ 2 స్థాయిలోకి వెళ్తుంది. ఖమ్మంలో వారం రోజులుగా ఎల్‌ఆర్‌ఎస్ ఎల్ 1 ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే 50 దరఖాస్తులను ప్లానింగ్ విభాగం ఉద్యోగులు పరిశీలన చేసి దస్త్రాలు అప్‌లోడ్ చేశారు. ఆయా ప్లాట్‌లను జీపీఎస్ ట్యాగింగ్ చేశారు. రోజుకు 50 దస్త్రాల పరిశీలన లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. అయితే ఎల్ 1లో కేఎంసీ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ మూడు ప్రభుత్వశాఖల సిబ్బంది ప్లాట్లు పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో అప్రూవల్ చేసిన తర్వాతనే లెవల్ 2కు చేరుతోంది. రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల సిబ్బంది ఎల్‌ఆర్‌ఎస్ సర్వేలో పాల్గొనక పోవటంతో ఇప్పటికే ప్లానింగ్ విభాగం పూర్తి చేసిన 50 దస్త్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. లెవల్ 2 స్థాయిలోకి వెళ్లలేక పోయాయి.

దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

మూడు ప్రభుత్వశాఖల విభాగాల ఉద్యోగులు ఒకే సమయంలో వస్తే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఒకే సమయంలో ఒకే రోజులో పని పూర్తి జరుగుతుంది. కాని మూడు ప్రభుత్వశాఖల ఉద్యోగులు మూడు పర్యాయాలు ప్లాట్‌ల పరిశీలనకు రానుండటంతో దరఖాస్తుదారులు వారి పనులు నిలుపుదల చేసుకొని మూడు పర్యాయాలు ప్లాట్లు వద్దకు వస్తున్నారు.

ఖమ్మం నగర పాలక సంస్థ, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల ఉన్నతాధికారులు స్పందించి మూడు శాఖలతో బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా ఎల్ 1 ప్రక్రియను పూర్తి చేయాలని కొరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన దంతశస్త్ర చికిత్స

- జూలూరుపాడు ఆసుపత్రిలో ఆదివాసీ యువకుడి దవడలకు అమర్చిన కృత్రిమ ప్లేట్లు



శస్త్ర చికిత్స చేస్తున్న దంత వైద్యుడు వినోద్

జూలూరుపాడు, ఆగస్టు 27: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్సలు పొందేందుకు స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న ఓ ఆదివాసీ యువకుడికి సర్కార్ దవాఖానాలో ఉచితంగా అరుదైన దంతశస్త్ర చికిత్సలను చేశారు. జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో గట్టుమళ్ల గ్రామానికి చెందిన కుంజా కన్నారావు యువకుడి దవడలకు సంబంధించిన కృత్రిమ ప్లేట్లను వైద్యులు అమర్చారు. ఈ నెల 19న పాల్వంచలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సదరు యువకుడి కింద, పైన రెండు దవడలు విరగడంతో దంతాలను కోల్పోయాడు. దీంతో చికిత్స చేయించుకునేందుకు తగిన ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఇండోస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహకులు నరేందర్‌కు విషయం తెలిసింది. దీంతో అతను స్పందించి హైదరాబాద్‌లోని దంతవైద్యునిగా పని చేస్తున్న పోటు వినోద్‌కు విషయాన్ని వివరించారు. దీంతో వినోద్ జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి రెండు గంటల పాటు శ్రమించి యువకుడి రెండు స్టీల్‌ప్లేట్లను అమర్చి శాస్త్ర చికిత్సను పూర్తి చేశాడు. వారం రోజులపాటు యువకుడ్ని ఆసుపత్రిలో ఉంచి వైద్యసేలు అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా వినోద్ గతంలో జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో దంతవైద్యుడిగా పని చేసి పలువురి శస్త్ర చికిత్సలు చేశారు. గతానికి భిన్నమైనటువంటి ఖరీదైన శస్త్ర చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో చేశామని, ఇలాంటివి అరుదుగా జరుగుతుంటాయని, ప్రైవేట్ ఆసుపత్రిలో ఇలాంటి శస్త్ర చికిత్సకు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యుడు తెలిపారు. యువకుడి దవడల అమరికకు స్టీల్‌ప్లేట్లను స్వచ్ఛంద సంస్థ అందించినట్లు ఆయన తెలిపారు.

తాత్కాలికంగా రైల్వే గేట్ మూసివేత

- నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బందుల్లో గోవిందాపురం(ఏ) గ్రామ ప్రజలు



మూసివేసిన రైల్వే గేటు ఇదే

బోనకల్, ఆగస్టు 27: గోవిందాపు రం(ఎ) మండలంలో చిన్న కుగ్రామం. ఆంధ్రా సరిహద్దు గ్రామం కావడంతో పాటు గ్రామం మధ్య గుండా రైల్వే ట్రాక్ ఉండటంతో ఊరు రెండుగా విడిపోయింది. ట్రాక్‌కు ఒకవైపు ఎస్సీ కాలనీ, మరోవైపు బీసీ, ముస్లీం, జనరల్ కేటగిరీల ఇళ్లు ఉంటాయి. ట్రాక్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వేగేటు గత మూడు రోజులుగా పూర్తిగా మూసి వేశారు. మూడో రైల్వేలైన్ పనులు జరుగుతుండటంతో రైల్వేగేటు ను తెరవడం లేదు. దీంతో గ్రామంలోని ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు జ్వరాల బారీన పడటం, మరికొందరు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందు కు ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రైల్వేలైన్ పనులు జరుగుతున్నా, ప్రజల బాధలు పట్టావా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ దారి సౌకర్యం కల్పించ కుండా గేటు రోజుల తరబడి మూసి వేస్తే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై కలెక్టర్‌తో పాటు మంత్రులను కలిసేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సిద్దమవుతున్నారు.

మట్టి గణనాథుల ఏర్పాటుపై

ప్రచారమేదీ?

- కాలుష్య నియంత్రణ మండలి ప్రచారం కరువు
- గత ఏడాది భద్రాద్రి వద్ద గోదావరిలో 1,600 విగ్రహాల నిమజ్జనం



గోదావరి ఒడ్డున వందల సంఖ్యలో నిమజ్జనానికి తరలివచ్చిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు (ఫైల్)



భద్రాచలం, ఆగస్టు 27: మట్టి గణనాథుడిని పూజిద్దామంటూ ప్రకటనలే కాని, ఆచరణలో మాత్రం జిల్లా అధికార యంత్రాంగం ఏ మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా వేల సంఖ్యలో గణనాథులు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కొలువుదీరుతుండగా, అందులో 90 శాతం ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసిన విగ్రహాలు ఉంటుండటం గమనార్హం. నిమజ్జనం సమయంలో ఈ విగ్రహాలన్నింటిని భద్రాచలం వద్ద పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. దీంతో గోదావరి సైతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోందని పర్యావరణ అభిమానులు వాపోతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నదుల్లో, చెరువుల్లో కలపడం వలన అవి కలుషితమవుతున్నాయి. అలాగే నదిలోని జీవ రాశులు నశించే అవకాశం ఉంది. ఇంత హానికారమైన పీవోపీ విగ్రహాలను వీడి, మట్టి గణపయ్యలతో పూజలు చేయాలని ప్రచారం చేసేవారు కరువయ్యారు. అయితే ప్రతిసారి వినాయక చవితి సమయంలో గణేష్ విగ్రహాలను మట్టితో తయారు చేసిన వాటినే వినియోగించాలని పర్యావరణ వేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఘోషిస్తున్నా ఎవరికి పట్టని పరిస్థితి నెలకొంది. ఈసారి సెప్టెంబరు 9న వినాయక చవితి పురస్కరించుకొని గణనాథులను ప్రతిష్ఠించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకమండళ్లను పీవోపీ విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా మట్టి విగ్రహాలను వినియోగించాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రచారం చేయాల్సి ఉన్నా ఆ దిశగా చేసిన ప్రచారం నేతిబీరకాయ చందంగా ఉందని చెప్పక తప్పదు.

ఎవరికి పట్టదా..!

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసేందుకు గణేష్ నవరాత్రులు నిర్వహిస్తుంటారు. అటు భక్తితో పాటు ఇటు ఆత్మీయత స్నేహబంధాలను పెంపొందించే అరుదైన పండుగ వినాయక చవితి. పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి 11 రోజుల పాటు భక్తులచే పూజలందుకోనున్న గణపయ్యను భద్రాచలంలోని గోదావరిలో, సంబంధిత మండలాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేయడం జరుగుతోంది. మట్టి విగ్రహాలను నిర్వాహక కమిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పూర్తిస్థాయిలో ప్రచారం చేయకపోవడంతో ప్రజల్లో అవగాహన లేమి కనిపిస్తోంది. ఫలితంగా పీవోపీ విగ్రహాలు వేల సంఖ్యలో గోదావరిలో నిమజ్జనం చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. గత పుష్కర కాలంగా భద్రాచలం వద్ద గోదావరిలో ప్రతి ఏటా 1,600 నుంచి 2,000 విగ్రహాలు నిమజ్జనం చేస్తున్నారు. ఇందులో 90 శాతం పీవోపీ విగ్రహాలే కావడం గమనార్హం. దీని వలన ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టిన అనంతరం విగ్రహాలను నదీ పరివాహక ప్రాంతంలో చెల్లా చెదురై కనబడటం పూర్తిస్థాయిలో నిమజ్జనం కాని పరిస్థితి తారసపడుతోంది. అంతే కాదు ఈ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తుండటంతో నదిలో ఉండే జీవరాశులు సైతం నశిస్తున్నాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. నీటిని శుభ్రపరచడంలో ఉపయోగపడే ఆ జీవరాశులు నశించడం వలన గోదావరి నీరు మరింత కాలుష్యకోరల్లో చిక్కుకునే ప్రమాదం తలెత్తుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామగుండం థర్మల్ ప్లాంట్‌ను

జెన్కో ఆధ్వర్యంలో నిర్మించాలి

- ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్‌ల అభ్యర్థన

పాల్వంచ, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి, జెన్కోల జాయింట్ వెంచర్‌లో కాకుండా కేవలం జెన్కో ఆధ్వర్యంలో మాత్రమే నిర్మించాలని ఇంజనీర్స్ అసోసియేషన్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్‌ల సభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరు అసోసియేషన్ల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా మంగళవారం పాల్వంచ కేటీపీఎస్ 7వ దశలో ఇంజనీర్లు లంచ్ మోషన్ డెమాన్‌స్ట్రేషన్, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ సీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్కో ఇంజనీర్లకు ఏడు సంవత్సరాల నుంచి పదోన్నతులు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చిన కొద్దిపాటి ప్రమోషన్స్‌ను కూడా 2022లో వెనక్కు తీసుకున్నారన్నారు. సత్వరమే వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ల నాయకులు మంగీలాల్, బ్రహ్మాజీ, మహేష్, మధుబాబు, యాకూబ్, రవి, రాజేష్, సంతోష్, లక్ష్మి, గణేష్, నాగేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ సీఈకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రోడ్డు విస్తరణకు నిధుల ఎఫెక్ట్

» ఏడాదిగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు » గుంతలమయంగా పట్టణం » నరకయాతన పడుతున్న ప్రజలు

అశ్వారావుపేట, ఆగస్టు 27: అశ్వారావుపేట పట్టణ సుందరీకరణ అంటూ ప్రారంభించిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు నిధులు ఎఫెక్ట్ పడింది. ఏడాది క్రితం ప్రారంభించిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. పట్టణంలో ఎక్కడ చూసినా విస్తరణ పేరుతో తవ్వి వదిలేసిన పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రజలకు నరకయాతన అంటే ఏమిటో చూపిస్తున్నాయి.

గత అసెంబ్లీ ఎన్నికల ముందు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు పట్టణమంతా లోతైన గుంతలు తవ్వారు. ఈ గుంతల్లోకి వర్షపు నీరు చేరి మురికి కూపాలుగా మారుతున్నాయి. దుకాణాల్లోకి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందుల ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలపైన వీటి ప్రభావం పడుతుండటంతో, ఇంకెన్నాళ్లు ఈ బాధలు అంటూ వ్యాపారవర్గాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో హడావుడిగా ప్రారంభించి, అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. కొత్త ప్రభుత్వంలో అయినా ఈ పనులు పూర్తి అవుతాయని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది.

రూ.20కోట్లతో పనులు మంజూరు..

2023 ఆగస్టులో అశ్వారావుపేట పట్టణ పరిధిలోని భద్రాచలం రోడ్డు, ఖమ్మం-జీలుగుమిల్లి రోడ్డు విస్తరణ పనులు, డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్ పనులకు అప్పటి ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో అప్పటి పాలకులు ముందస్తు ప్రణాళికలు లేకుండా హడావుడిగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సుమారుగా 10 అడుగుల వెడల్పున, నాలుగు అడుగుల లోతున గుంతలు తవ్వారు. డివైడర్ పనులను ప్రారంభించారు. గుంతలు తవ్విన చోట మంచినీటి పైపులైన్లు, విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండటంతో పైపులు పగిలి గుంతలన్నీ బురదనీటితో నిండి పోయాయి. పైపు లైన్లు పక్కకు మార్చడానికి సరిపడా నిధులు లేకపోవడంతో నాలుక కరుచుకున్న అధికారులు అందుకవసరమైన అనుమతుల కోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో అనుమతులు రాకపోవడంతో తవ్విన గుంతలను తవ్వినట్లే వదిలేశారు. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో పట్టణమంతా గుంతలమయంగా మారి ప్రజలకు నరకం కనిపిస్తోంది. ఏ వ్యాపార సముదాయాలకు వెళ్లాలన్న నాలుగు అడుగుల లోతు గోతుల్లోకి దిగి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఉన్న పనులను అధికారంలోకి వస్తే తక్షణమే పూర్తి చేస్తామని కొత్త పాలకులు హామీలు గుప్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావొస్తున్నా, పైపులైన్లు, విద్యుత్ లైన్ షిఫ్టింగ్ కోసం రూ.50లక్షలు కేటాయింపజేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహితం ప్రకటించారు. అయినా ఈ రోడ్డు విస్తరణ పనులు నేటికీ అంగుళం కూడా కదలలేదు. మొదటి ప్రాధాన్యత పనిగా చేపట్టాల్సిన ఈ పనులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పొడిగింపు ఉంటుందా?...


ఈ రోడ్డు విస్తరణ పనులు ఖమ్మం, జీలుగుమిల్లి రోడ్డులో కొంత మేరే మంజూరువ్వడంతో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జీలుగుమిల్లి వైపున చెక్‌పోస్టు వరకు, ఖమ్మం వైపున వ్యవసాయ కళాశాల వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులను పొడిగిస్తామని ప్రకటించారు. మధ్యలో నిలచిపోయిన పనులనే పూర్తి చేయలేదు. అదనంగా రహదిరి పొడిగింపు పనులు సాధ్యమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


అశ్వారావుపేటలో రోడ్డు విస్తరణ కోసం తవ్వి వదిలేసిన రహదారి దృశ్యం(ఫైల్)

ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం పట్టణంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయలేదు. ప్రజలను ఎప్పటి నుంచో ఇబ్బంది పెడుతున్న మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పడలేదు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ అడ్డదిడ్డంగా ఉన్నాయి. వాటిపై ప్రణాళికాబద్ధమైన ప్రతిపాదనలకు కూడా ఇంత వరకు నోచుకోలేదు. దీంతో పట్టణవాసుల్లో ఆయా అంశాలపై ఆగ్రహం వ్యక్తం అవుతుంది. కొత్త ప్రభుత్వంలోనైనా దశ మారుతుందనుకుంటే బాధలు తప్పడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశాలు వచ్చే స్థానిక ఎన్నికలలో ప్రభావాన్ని చూపే అవకాశాలు లేకపోలేదనే ప్రచారం నడుస్తుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

బీటీపీఎస్‌లో బాయిలర్ లీకేజీ

● 270మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం



మణుగూరు రూరల్, ఆగస్టు27: మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ యూనిట్-2 లో బాయిలర్ లీకేజీ కారణంగా మంగళవారం విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్-2లోని బాయిలర్ లీకేజీ కావడంతో 279 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో ఇంజనీర్ల బృందం యుద్ధ ప్రాదిపదికన మరమ్మతులు ప్రారంభించారు. మంగళవారం రాత్రి వరకు విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 2నెలల క్రితం, యూనిట్-1లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 270మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోగా, తాజాగా యూనిట్-2లో జరిగిన బాయిలర్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తికి మరింత అంతరాయం ఏర్పడింది.

భద్రాద్రి దేవస్థానం సిబ్బంది విధుల్లో మార్పు

● ఉత్తర్వులు జారీ చేసిన దేవస్థానం ఈవో

భద్రాచలం, ఆగస్టు 27: దేవస్థానంలోని ప్రసాదాల కౌం టర్ విభాగంలో పని చేసే పలువురు సిబ్బంది విధుల్లో మార్పు చేస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన ఆలయం టికెట్ కౌంటర్‌లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ జి.చంటికుమార్‌కు ప్రసాదాల కౌంటరు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అలాగే ప్రసాదాల కౌంటర్‌లో పని చేసే కె.సతీష్‌కు అదే విభాగంలో రిలీవర్‌గా బాధ్యతలప్పగించారు. ప్రసాదాల కౌంటర్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎం. నరసింహారావుకు కార్యాలయంలోకి మార్చారు. అలాగే హెల్ప్‌డెస్క్‌లో పని చేసే ఔట్‌సోర్సింగ్ వర్కర్ పి.కల్యాణ్‌రామ్‌కు ప్రధాన ఆలయంలోని టికెట్ కౌంటర్‌లో విధులు కేటాయించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి


సాగర్(ఫైల్)

ఆళ్లపల్లి, ఆగస్టు 27: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో జరిగింది. మర్కోడు గ్రామానికి చెందిన చామకూరి సాగర్(26) గత వారం రోజులుగా జ్వరం, కామెర్ల వ్యాధితో బాధపడు తూ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది.

సంతకం ఫోర్జరీ చేసిందని...
భార్యపై భర్త ఫిర్యాదు

పాల్వంచ, ఆగస్టు 27 : వేరే వ్యక్తితో తన భార్య తన సంతకం ఫోర్జరీ చేసిందని భర్త చేసిన ఫిర్యాదుపై పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్‌లో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బోడా బాసు 2016లో పాల్వంచ మండలం పాత సూరారం రెవెన్యూ పరిధిలో దస్రు వద్ద నుంచి ఆరున్నర కుంటల భూమిని కొనుగోలు చేసి అతడి పేరుమీద ఆ ఆస్తిని రాయించుకున్నాడు. అనంతరం జరిగిన కుటుంబ కలహాలతో అతడి భార్య భవానీ అతడిని ఇంటి నుంచి గెంటి వేసింది. అనంతరం భవానీ మంట ఎలమందారెడ్డి అనే వ్యక్తితో కలిసి తన భర్త బాసు సంతకాన్ని ఫోర్జరీ చేసి తన పేరుమీదకు ఆ ఆస్తిని బదలాయించుకుంది. ఇది తెలిసిన అతడు తన భార్య, ఎలమందారెడ్డిలు తన సంతకం ఫోర్జరీ చేశారని, తనను మోసం చేశారని, తనను చంపుతామని బెదిరిస్తున్నారని కోర్టులో ప్రైవేట్ కేసు వేశాడు. కోర్టు ఆదేశాల మేరకు భవానీ, ఎలమందారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

వైరాలో గ్యాస్ లీక్

● తప్పిన ప్రమాదం

మధిరటౌన్, ఆగస్టు27: వైరా రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ కింద ఉన్న మిడ్ స్ట్రీట్ బెకరీలో ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకైంది. దీంతో మంటలు ఒక్కసారిగా గది మొత్తం వ్యాపించాయి. అక్కడ పని చేసే వారు వెంటనే బయటకు పరుగులు తీశారు. ఎగిసిపడుతున్న మంటలను అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఆర్పివేశారు. కాగా మంటలను అదుపుచేయకపోతే పై అంతస్తులోని దుస్తుల దుకాణానికి వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు పేర్కొంటున్నారు. సంఘటనా స్థలాన్ని ఫైర్ ఆఫీసర్ బాలకృష్ణ, టౌన్ ఎస్ఐ సంధ్య పరిశీలించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..
నిప్పంటించుకున్న వ్యక్తి

» పరిస్థితి విషమం...

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు27: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మద్యం మత్తులో ఒంటిపై డీజిల్ పోసుకొని వ్యక్తి నిప్పంటించుకున్న సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హనుమాన్ బస్తీ ప్రాంతానికి చెందిన కొప్పుల ఇమ్మానియేలు(54) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి వద్ద మద్యం మత్తులో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు వెంటనే అతడిని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి కి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అతడి శరీరం 90 శాతం కాలిపోయింది.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 27: అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని కాకినాడ సమీపంలోని జగ్గంపేట నుంచి 35 పశువులను ఎటువంటి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అశ్వారావుపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువుల వ్యాన్ పట్టిబడింది. నల్గొండ జిల్లా దేవరకొండ మండలానికి చెందిన ఆర్.శ్రీను, బాజ్జిపై కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 27: ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ రెవెన్యూ, హౌజింగ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, ప్రభుత్వ భవిష్యత్ అవసరాలకు, పరిశ్రమలు, అభివృద్ధికి స్థలాలు ఎంతో అవసరమన్నారు. రఘునాధపాలెం మండలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని అక్రమ మైనింగ్ కి అడ్డుకట్ట వేయాలన్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోళ్లపాడు చానల్ పై ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ జీవో 58, 59 లపై న్యాయబద్ధంగా లేని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ఆక్రమణలు, అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్నచోట ప్రత్యామ్నాయ స్థలం చూపాలన్నారు. రోడ్ల విస్తరణ పై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నెస్పీ భూములకు సంబంధించి చట్టబద్ధంగా స్థలాల పంపిణీ, ఆక్రమణలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. చెరువులు, కాల్వల స్థలాల పరిరక్షణ చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద ఏరోజుకారోజు తడి, పొడిచెత్త వేరుచేయడం, డిస్పోజ్ చేయడం జరగాలన్నారు. రహదారుల కిరువైపుల మొక్కలు నాటేటప్పుడు, విస్తరణ, కరంట్ లైన్లను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్ అవసరాల మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణం చేపట్టిన అన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి, అధికారులు అన్ని కాలనీలు సందర్శించి, నిర్మాణ పనుల పరిస్థితిని తనిఖీ చేయాలన్నారు. ప్రారంభించిన ఇళ్ల పునాది, లెంటల్, స్లాబు వరకు, తుది దశలో ఉన్న ఇళ్ల పరిస్థితి వారిగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇళ్లను పూర్తిచేసి, లబ్ధిదారులకు అందజేయడానికి అవసరమైన నిధుల వివరాలు సమర్పించాలని సూచించారు..

సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, గుర్తించిన స్థలాల పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితిపై అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, డీఆర్డీవో సన్యాసయ్య, డీఆర్వో ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, నీటిపారుదలశాఖ ఈఈ అననేయ, హౌజింగ్ ఈఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

» పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి


సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 27: మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి విమర్శించారు. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నిర్భయ వంటి మహిళా రక్షణ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు చేయకపోవడంతోనే ఏదో ఒకచోట మహిళలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఆధునిక కాలంలో సామూహిక అత్యాచారాలు జరగడం సమాజంలో మహిళలకు ఉన్న రక్షణను ప్రశ్నిస్తున్నాయని విమర్శించారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ పరిపాలనలో విద్యా, వృత్తి, వ్యాపార రంగాల్లో పని చేస్తున్న విద్యార్థులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆరోపించారు. నిందితులను శిక్షించడంలో ప్రభుత్వాలు, చట్టాలు విఫలం కావడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎంతో ప్రయోజనకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏ. మంగతాయి, టీ. ఝాన్సీ, శోభ, పరిమళ, అనసూయ, చైతన్య, స్వాతి తదితరులున్నారు.

45కిలోల గంజాయి స్వాధీనం

లక్ష్మీదేవిపల్లి, అగస్టు27: కారులో రవాణా చేస్తున్న గంజాయిని మంగళవారం మండల పరిధిలోని లోతువాగు వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్(ఖమ్మం)బృందం స్వాధీనం చేసుకుంది. కొత్తగూడెంలో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా కారులో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు వారు గుర్తించారు. సుమారు 45కిలోల గంజాయిని సీలేరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారులు వివరాలు వెల్లడించారు. నిందితులు సంగారెడ్డికి చెందిన రాథోడ్ సంతోష్, భవనగిరి జిల్లా ముల్కలపల్లికి చెందిన బానోత్ వీరును అరెస్టు చేసినట్లు బృందం తెలిపింది. నిందితులతో పాటు వారి వాహనాన్ని, సెల్‌ఫోన్లను స్వాధీన పర్చుకుని కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకట్, హరీష్, హనుమంతరావు, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు. సిబ్బందిని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఖమ్మం) జి. గణేష్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిలు అభినందించారు.

మద్దులపల్లి వద్ద 3.9కిలోలు..

ఖమ్మం రూరల్, ఆగస్టు 27: అక్రమంగా తరలిస్తున్న 3.9 కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని మద్దులపల్లి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఖమ్మం పట్టణంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన మిర్యాల యల్లయ్య, మండల పరిధిలోని నాయుడుపేటకు చెందిన దేవిశెట్టి వెంకన్న ఇద్దరు ద్విచక్రవాహనంపై 3.9 కిలోల గంజాయిని తరలిస్తు పట్టుబడ్డారు. గంజాయి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. గంజాయిని, ద్విచక్రవాహనాన్ని పోలీస్‌లు సీజ్ చేసి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెసర రైతుల పరేషాన్

» మార్కెట్‌లో పడిపోయిన ధరలు » నిమ్మకునీరెత్తినట్టుగా మార్క్‌ఫెడ్

వైరా, ఆగస్టు 27: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పెసర పంట దిగుబడులు రైతు చేతికొస్తున్న తరుణంలో ధరలు అమాంతంగా పడిపోయాయి. పెసర మద్దతు ధర ఢమాల్ కావడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. పంట రైతుల చేతికి వస్తున్న తరుణంలో మద్దతు ధరకు కొనుగోలు చేయటానికి మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి. మార్క్‌ఫెడ్ పత్తా లేకపోవడంతో పెసర రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 14738ఎకరాల్లో పెసర సాగు చేశారు. అత్యధికంగా చింతకాని మండలంలో 5920ఎకరాల్లో, కొణిజర్ల మండలంలో 4789ఎకరాల్లో, వైరా మండలంలో 1402ఎకరాల్లో, ముదిగొండలో 742ఎకరాల్లో, ఖమ్మం రూరల్‌లో 288ఎకరాలు, బోనకల్‌లో 515ఎకరాలు, తిరుమలాయపాలెంలో 307ఎకరాలు, తల్లాడలో 136ఎకరాల్లో, ఎర్రుపాలెంలో 168ఎకరాలు, ఖమ్మం అర్బన్‌లో 125ఎకరాల్లో, రూరల్‌లో 288ఎకరాల్లో ఇక మిగిలిన మండలాల్లో వందెకరాల్లోపు పెసర సాగుచేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు ఉన్నాయి.

ఓవైపున అధిక వర్షాలతో ఇప్పటికే పెసర దిగుబడులు తక్కువగా ఉన్నాయి. ఒక ట్రెండురోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి పంటనైనా కాపాడుకొనేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పెసర కోసే మిషన్ల కోసం రైతులు పోటీ పడుతున్నారు. అవసరమైన మిషన్లు అందుబాటులో లేకపోవడంతో పొలాల దగ్గరే వాటి కోసం కాపలా కాస్తున్నారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం ప్రకటించిన పెసలు మద్దతు ధర క్వింటా ఒక్కింటికి రూ.8682 ఉండగా బహిరంగ మార్కెట్లో వ్యాపారులు రూ.ఆరువేలకు మించి చెల్లించటం లేదు. మద్దతు ధర లభించక పెసర రైతులు విలవిలలాడిపోతున్నారు. రూ.ఆరువేలకు కొనుగోలు చేసిన పెసలను కూడా కొంతమంది దళారులు ఎగుమతి చేయకుండా కాంటా వేసిన బస్తాలను వదిలివేసి వెళ్లిపోతున్నారు.


రైతులు ఆరబోసుకున్న పెసలు

దాంతో పెట్టుబడులు కూడా రాక రైతులు దిగాలుపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలకు ఏపుగా పచ్చిరొట్ట పెరిగి ఎకరాకు 2,3క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. విత్తనాలు, పురుగుమందుల పిచికారి, ట్రాక్టర్ దుక్కులు, కోత యంత్రం తదితర పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పుడు స్వల్పంగా వచ్చిన పంటకు మద్దతు ధర రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారులు అయినకాడికి రూ.ఐదారువేలకే క్వింటా పెసలు ఖరీదు చేస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. గతంలో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయడంతో రైతుల నుంచి మద్దతు ధరకు పెసలు కొనడంతో బహిరంగ మార్కెట్లో వ్యాపారులు పోటీపడి రూ.8వేల వరకు ధర చెల్లించారు. ఇప్పుడు మార్క్‌ఫెడ్ జాడ లేకపోవడంతో దళారులు అడ్డగోలుగా ధర తగ్గించడంతో పెసర రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాల్వంచ, ఆగస్టు 27 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని శేఖరం బంజరకు చెందిన బోడా రాందాస్(47) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని అతని కొడుకు చంటి గమనించి చుట్టు పక్కల వారికి సమాచారం అందించాడు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించి రాందాస్ మృతి చెందాడని నిర్ధారించారు. అనంతరం స్థానికులు హైదరాబాద్‌లో నివాసముంటున్న మృతుడి కుమార్తె ఉమాదేవికి సైతం సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఉమాదేవి ఇంటికి చేరుకుని తన తండ్రి మృతి చెంది ఉండటాన్ని గమనించి అది సాధారణ మృతి కాదని అనుమానించింది. దీంతో తన తండ్రి మరణంపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, ఆగస్టు 27: మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కామంచికల్ గ్రామానికి చెందిన మరుపు బ్రహ్మచారి (45) భార్య, పిల్లలు కుటుంబ తగాదాలతో అతడికి దూరంగా ఉంటున్నారు. అతడు ఒక్కడే ఒంటరిగా ఉండడంతో ఇటీవల మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఈనెల 25వ తేదీన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బ్రహ్మచారి ఉరేసుకున్న విషయం ఎవరూ గుర్తించలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో మంగళవారం చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహన్ని అన్నం శ్రీనివాస్‌రావు బృందం సహాయంతో పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వనాథపల్లిలో చోరీ

● ఐదు తులాల బంగారం, రూ.28వేల నగదు అపహరణ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి

కారేపల్లి, ఆగస్టు27: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన దమ్మాలపాటి రాంబాబు అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి ఐదు తులాల బంగారం, రూ.28వేల నగదును అపహరించుకుపోయారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

బుగ్గపాడులో చోరీ...

సత్తుపల్లిరూరల్, ఆగస్టు25: మండలంలోని బుగ్గపాడులోని సోమవారం అర్ధరాత్రి వరుసగా దొంగలు మూడు చోట్ల దొంగతనం చేశారు. గ్రామంలోని ధర్మారావు, పర్సా కేశవరావు కూల్‌డ్రింక్ షాప్, రామకృష్ణ కిరాణాషాప్‌లలో దొంగతనానికి పాల్పడి మద్యం బాటిళ్లు, కూల్‌డ్రింక్, సిగరేట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లినట్లుగా బాధితులు చెబుతున్నారు. కిరాణాషాప్‌లో ఫ్రిడ్జ్ పగులకొడుతుండగా, అలజడి రావడంతో కుక్కలు మొరిగాయి. గమనించిన స్థానికులు దొంగల వెంటపడగా చీకటిలో వారు పరారయ్యారు. అయితే వారు ధరించిన నల్లటి వస్త్రాలను గ్రామంలోనే విడిచి వెళ్లగా, పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలాలను పరిశీలించారు. దొంగతనం చేస్తున్న వీడియోలు సీసీ కెమెరాలో రికార్డవ్వగా, ఆ పుటేజీలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి.

మద్యం మత్తులో...
తండ్రిని హతమార్చిన కుమారుడు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు రూరల్, ఆగస్టు27: మద్యం మత్తులో కుమారుడు తండ్రిని హతమార్చిన సంఘటన మండలంలోని పగిడేరు గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పగిడేరు ఎస్టీ కాలనీకి చెందిన కొర్సా బుచ్చయ్య (80) తను సాగు చేసిన పత్తి చేను వద్ద ఉండగా, కొడుకు సూర్యనారాయణకు తండ్రి బుచ్చయ్యకు మధ్యనున్న ఆస్తి వివాదాల నేపథ్యంలో కర్రతో దాడి చేశాడు. వృద్ధుడు కావడంతో అక్కడికక్కడే తీవ్ర గాయాలతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న మణుగూరు సీఐ సతీష్‌కుమార్, తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు మృతుడు బుచ్చయ్య భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు సూర్యనారాయణ పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

శిశు విక్రయ అభియోగంపై విచారణ

కల్లూరు, ఆగస్టు27: మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో శిశు విక్రయం అభియోగంపై మంగళవారం కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మల జ్యోతి విచారణ జరిపారు. ఏపీలోని ఒంగోలు జిల్లా కందుకూరు ప్రభుత్వం ఆసుపత్రిలో శిశు విక్రయమైనట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన బాలసుందరరావు అనే వ్యక్తిపై అభియోగం రావడంతో అధికారితో పాటు ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్లు వెంకటమ్మ, సుజాతలు నిందితుడి ఇంటికి వెళ్లి ప్రాథమిక స్థాయిలో విచారణ జరిపారు. శిశువు ఆసుపత్రిలో మాయమైన విషయలో తమకు ఎలాంటి సంబంధం లేదని రాతపూర్వకంగా ఐసీడీఎస్ అధికారులకు బాల సుందరరావు తెలిపాడు. ఆసుపత్రిలో శిశువును తాము తెచ్చుకోవడం జరగలేదని సీడీపీవోకు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులను విచారించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పుష్పాలత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల చేతివాటం


» కోర్టులో కేసు ఉండగానే పట్టాదారు పేరు మార్పు

సత్తుపల్లి, ఆగస్టు 27: సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కొందరు రెవెన్యూ ఉద్యోగుల చేతివాటం కారణంగా ఒక రైతు పేరుతో ఉన్న భూయాజమాన్య హక్కులను మరొకరి పేరుతో మార్చారు. దీనిపై బాధిత రైతు మామిళ్లపల్లి కేశవరావు మంగళవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన మామిళ్లపల్లి రాధమ్మకు సర్వే నెంబర్ 258లో 1.33 ఎకరాలు, 259/అలో 12 గుంటల భూమి మొత్తం 2.05 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి రాధమ్మ, ఆమె కుమార్తె గారపాటి నారాయణమ్మల మధ్య 2012 నుంచి కోర్టులో వివాదం నడుస్తోంది. ధరణి పోర్టల్ ప్రవేశపెట్టిన సమయంలో 2018లో రాధమ్మకు కొత్త పాస్ పుస్తకాలు కూడా జారీ చేశారు. అప్పట్లోనే రైతు బంధు కూడా అందజేశారు.

ఈ క్రమంలో నారాయణమ్మ కుటుంబ సభ్యులు కోర్టులలో కేసు ఉందంటూ అభ్యంతరం వ్యక్తం చేయడంతో, అధికారులు ఆమె పేరుతో ఉన్న భూమిని ధరణిలో కోర్టు వివాదం కారణంగా బ్లాక్ చేశారు. కోర్టు వివాదం కారణంగా బ్లాక్ చేయడం వల్ల ఎవరికి రైతు బంధు రాకపోగా, ఎటువంటి లావాదేవీలు జరిపే అవకాశం లేదు. కాగా అప్పటి నుంచి భూమి తమ స్వాధీనంలోనే ఉందని రాధమ్మ కుమారుడు కేశవరావు తెలిపారు. రాధమ్మ మరణించినప్పటికీ కోర్టు వివాదం నడుస్తోందని, కాని రాధమ్మ పేరుతో ఉన్న భూమి వివరాలను ధరణిలో గారపాటి నారాయణమ్మ పేరుతో రెవెన్యూ సిబ్బంది అక్రమంగా మార్చారని ఆయన ఆరోపించారు. ఒక పక్క కోర్టులో కేసు ఉండి ధరణిలో భూమి హక్కులు బ్లాక్ చేసిన సమయంలో పట్టాదారుకు తెలియకుండా ఎలా మారుస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. పేరు మారడంతో పాటు నారాయణమ్మ కుమారుడు తన పేరుతో పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కోర్టులో కేసు నడుస్తుండగా, ధరణిలో బ్లాక్ చేసిన వివరాలను మార్చడం వెనుక భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డిజిటల్ సంతకం కాలేదు

● యోగీశ్వరరావు, తహసీల్దార్, సత్తుపల్లి



పాస్ పుస్తకం జారీ చేసిన సమయంలో మామిళ్లపల్లి రాధమ్మ పేరు ఉంది. కాని నారాయణమ్మ పేరుతో ఎప్పుడు మారిందో తెలియదు. ధరణిలో పేరు మారినప్పటికీ డిజిటల్ సంతకం కాలేదు. నారాయణమ్మ కుమారుడు తన పేరుతో హక్కులు కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసిన విషయం వాస్తవం. కాని ఆన్‌లైన్‌లో కోర్టు వివాదం అని చూపుతోంది.

కరకగూడెంలో యూరియా కోసం రైతుల పాట్లు


సహకార సంఘం వద్ద ఉన్న రైతులు

కరకగూడెం, ఆగస్టు 27: మండల వ్యాప్తంగా రైతులు ఎక్కువగా వరి పంటనే రైతులు సాగు చేస్తున్నారు. మండలంలో ఫర్టిలేజర్ దుకాణాలు ఉన్నప్పటికీ ఎక్కడా యూరియా లేదు. కాగా మండల కేంద్రంలోని సహకార సంఘంలో యూరియా కోసం మంగళవారం రైతులు ఎగబడ్డారు. ఈ విషయమై సహకార సంఘం సిబ్బంది చందా కాంతారావును వివరణ కోరగా యూరియా కొరత లేదని తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు 350 యూరియా బస్తాలను విక్రయించినట్లు పేర్కొన్నారు. ఇంకా 770 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సహకార సంఘంలో ప్రస్తుతం 2020 రకం యూరియా అందుబాటులో లేవని, రెండు రోజుల్లో వస్తాయని పేర్కొన్నారు. రైతులు నేరుగా తమ ఆధార్ కార్డు తీసుకువచ్చి యూరియా తీసుక వెళ్లాలని తెలిపారు.



వారం రోజుల్లో రైతులకు నీరందించాలి: ఎమ్మెల్యే

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 27: ఐదారు రోజుల్లో అన్ని పనులు పూర్తిచేసి వారం రోజుల్లో రెండు కాలువల ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీటిని అందించాలని, ఆ దిశగా పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. మండలంలోని గుమ్మడివల్లి సమీపంలోని మధ్యతరహా జలాశయం పెదవాగు ప్రాజెక్టు గండి పనులను మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు పూర్తికాగానే రైతులకు నీటిని విడుదల చేద్దామని, ఆకార్యక్రమానికి తాను వస్తానని తెలిపారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా రెండు కాలువలకు నీరు వెళ్లేలా చూడాలని తెలిపారు. ఆయకట్టు రైతులు పంటలు వేసుకునేందుకు అవసరమైన నీటిని పూర్తిస్థాయిలో ఇవ్వాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇబ్బందులు లేకుండా పనులు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ మోతీలాల్, ఏఈ నవీన్, ఆయకట్టు రైతులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వ్యాధుల వేళ.. వేధిస్తున్న వైద్యుల కొరత

నలుగురు వైద్యులకు ఉన్నది ఒక్కరే

అందుబాటులో లేని ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్

ప్రజలకు సకాలంలో అందని సేవలు

ఆసుపత్రిలో గంటల కొద్ది రోగులు నిరీక్షణ



ఆసుపత్రిలో సేవలు పొందేందుకు వచ్చిన వారు

జూలూరుపాడు, ఆగస్టు 27: ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికి క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. సేవలను పొందేందుకు ఆసుపత్రికి వచ్చిన రోగులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తుంది. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిపై వారికి నమ్మకం సన్నగిల్లిపోతుంది. ఆసుపత్రిలో ఒక్క వైద్యాధికారే ఉండడంతో సేవలు అందడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో 9 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా వాటిలో 3 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 35 వేల మంది జనాభా ఉన్నారు. వీరిలో సగానికిపైగా ప్రభుత్వ ఆసుపత్రి ద్వారానే సేవలు పొందుతున్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ఈ ఆసుపత్రిలో నలుగురు వైద్యాధికారులను నియమించారు. కాగా వీరిలో ఇద్దరు వైద్యాధికారులు ఐదు నెలల క్రితం డిప్యూటేషన్‌పై జిల్లా ప్రోగ్రామ్ అధికారులుగా వెళ్లారు. దీంతో ఇద్దరు వైద్యాధికారులు సేవలను అందిస్తున్నారు. కాగా ఒక మహిళా వైద్యురాలు శిక్షణ నిమిత్తం తరచు వెళుతున్నారు. ఇక మిగిలిన ఒక్క వైద్యుడే మండలంలోని వేలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి రావడం భారంగా పరిణమించింది. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టల పోస్టుల ఖాళీగా ఉండడంతో రక్త పరీక్షలు చేయడం, చికిత్సలు పొందేందుకు వచ్చిన రోగులకు మందులను అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మండలంలో విషజ్వరాల తీవ్రత అధికంగా ఉంది. సేవలను పొందేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకు 200ల మందికి పైగా జ్వర పీడితులు వస్తున్నారు. వారికి ఈ ఒక్క వైద్యాధికారి సేవలను అందించడానికి ఇబ్బందులు పడుతున్నారు. సేవలను పొందేందుకు వచ్చిన రోగులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తుంది. అత్యవసర సేవలు అందించే విషయంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఒక్క వైద్యాధికారి ఉండడంతో గ్రామాలలో వైద్య శిబిరాల ఏర్పాటులో జాప్యం జరుగుతుంది. మండలంలో గిరిజన జనాభా అధికంగా ఉంది. తండాలలో విష జ్వరాలు ఇతర వ్యాధులతో ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలౌతున్నారు. వారికి సకాలంలో సేవలు అందే పరిస్థితి లేకపోవడంతో నానా ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైన ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురు వైద్యులను అందుబాటులో ఉంచి సకాలంలో సేవలు అందించే విధంగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో అవసరమైన సిబ్బందిని ఏర్పాటుచేయడంతోపాటు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క వైద్యాధికారే ఉండడంతో ఎదురౌతున్న సమస్యలను జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

కవితకు బెయిల్.. బీఆర్ఎస్ సంబురాలు



లక్ష్మీదేవిపల్లిలో స్వీట్లు పంచుకుంటున్న నాయకులు

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 27: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం బెయిలు మంజూరు చేసిన సందర్భంగా మంగళవారం లక్ష్మీదేవిపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాణాసంచాకాల్చి స్వీట్లు తినిపించుకుని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తరలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కవిత విడుదల కావడంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చినట్లైందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ ఎంపీటీసీ కొల్లు పద్మ, ఆత్మకమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, బీఆర్ఎస్ నాయకులు టి. ట్రైషప్ మునీర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు నక్క మధు, ఎస్టీ సెల్ అధ్యక్షులు రామకోటి, ఆటో మొబైల్ నాగరాజు, కొండలరావు, యాకయ, రాము, సుధీర్, వెంకటేష్, సీతారాంపురం బాలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలు సాగనివ్వం

ఇల్లెందు: తెలంగాణ ఉద్యమ నాయకులను బోగస్ కేసులతో, అరెస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లొంగదీసుకోలేవని బీఆర్ఎస్ వ్యవస్థాపక నాయకుడు దిండిగాల రాజేందర్ విమర్శించారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కవితపై కుట్ర పూరితంగా లిక్కర్ కేసు నమోదు చేసి జైలు పాలు చేశారని ఆరోపించారు.. న్యాయం గెలిచిందని పేర్కొన్నారు.. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్, గిన్నారపు రాజేష్, కౌన్సిలర్ల జేకే శ్రీను, కడకంచి పద్మ, శారద అబ్దుల్ నబీ, జబ్బార్, శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు



ఇల్లెందులో వేడుకలు

అసాంఘిక శక్తులకు సహకరిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు టౌన్, ఆగస్టు 27: సంఘ విద్రోహశక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఇల్లెందు పట్టణ, మండలంలో ఉన్న ఆర్ఎంపీ వైద్యులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు ప్రథమచికిత్స చేయాల్సిన అవసరం ఉందని అనవసరమైన పెద్ద వ్యాధులకు చికిత్సలు చేస్తే ఏదైన పరిణామం జరిగే అకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులకు రోగులను పంపే విధంగా చూడాలన్నారు.

సేవ ద్వారానే రుణం తీర్చుకుంటా: ఎమ్మెల్యే

అశ్వారావుపేట, ఆగస్టు 27: సేవలు అందించడం ద్వారానే ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం అశ్వారావుపేట మండలంలో మీ ఎమ్మెల్యే మీ ఇంటికి కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలలో మంజూరైన 11 సీఎంఆర్ఎఫ్, 55 కళ్యాణ లక్ష్మి చెక్కులను ఇంటింటికి వెళ్లి స్వయంగా చెక్కులను లబ్దిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తనపైన, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, అవకాశమున్నంతవరకు ప్రజలకు సేవలు అందించడం ద్వారానే వారి రుణాన్ని తీర్చుకోగలమని ఆయన అన్నారు. తన శక్తిమేర ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీలు ఇస్తూ ముందుకు వెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, చిన్నంశెట్టి సత్యనారాయణ, జేస్ట సత్యనారాయణ చౌదరి, మొగళ్లపు చెన్నకేశవరావు, ప్రమోద్, బొడ్డు సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

గవర్నర్ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్యే



సమావేశంలో గవర్నర్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే

భద్రాచలం, ఆగస్టు 27: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం ములుగు జిల్లాలో జరిగిన రాష్ట్ర గవర్నరు జిష్ణు దేవ్ వర్మ పర్యటనలో పాల్గొన్నారు. గవర్నరుతో కలిసి రామప్ప దేవాలయాన్ని దర్శించుకోవడంతో పాటు లక్నవరం వ్యూ పాయింంట్‌ను సందర్శించారు. అలాగే గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రత్యేక వైద్యశిబిరం



వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

దమ్మపేట, ఆగస్టు 27: మండలంలోని నాగుపల్లిలో మంగళవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ మహేశ్ పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ లావణ్య 111మంది పరీక్షలు చేశారు. రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఫార్మసిస్టు రామకృష్ణ, విజయకుమారి, ఏఎన్ఎంలు అలివేలు, సీత పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలి: బీజేపీ



మునిసిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పాల్వంచ టౌన్, ఆగస్టు 27: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆక్రమణలకు గురైన చెరువులను కాపాడాలని అని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవినాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పాల్వంచ తహసీల్దార్, మున్సిపల్ కకమిషనర్, నీటిపారుదల డీఈలకు వినతిపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న ఆరు చెరువులను పూర్వం రాజులు, ప్రభుత్వాలు, ప్రజల సౌకర్యార్థం చెరువులను నిర్మించారని నేడు ఆ చెరువులు చాలా వరకు అన్యాక్రాంతానికి గురయ్యాయని తెలిపారు. అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించి అన్యాక్రాంతం అయిన చెరువు భూములను కాపాడాలని అన్నారు. చెరువుల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుల అన్యాక్రాంతం వల్ల అనేక సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. కనుక అధికారులు స్పందించి, చెరువులను కబ్జా కోరల నుంచి కాపాడాలని కోరారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ అధికారులు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి బట్టు శివనాయక్, కిసాన్‌మోర్చా నాయకులు వెంకటేశ్వరరావు, నాయకులు బానోత్ ప్రతాప్, గంధం నాగేంద్ర ప్రసాద్, అలువాల సందీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో కృష్ణజన్మాష్టమి వేడుకలు

దుమ్ముగూడెం, ఆగష్టు 27: పర్ణశాల రామాలయంలో మంగళవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, విశేష శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన, విశేష ప్రసాదం నివేదన, ఊంజల్ సేవలను శాస్త్రోపేక్తంగా జరిపించారు. అలాగే లక్ష్మీనగరం ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, ముఖ్య అర్చకులు మదన్మోహన్ ఆచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు. లక్ష్మీనగరం దాసాంజనేయస్వామి వారి ఆలయంలోనూ వేడుకలను నిర్వహించారు.

నల్ల బ్యాడ్జీలతో సెర్ప్ సిబ్బంది నిరసన

దుమ్ముగూడెం, ఆగస్టు 27: సెర్ప్ డీపీఎం రంగారావు రాష్ట్ర అధికారులకు సమర్పించిన తప్పుడు నివేదికపై చర్యలు చేపట్టాలని తెలంగాణా గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం సెర్ప్ కార్యాలయం వద్ద మంగళవారం మండల సెర్ప్ సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అశ్వాపురం మండలంలో సీసీపై వచ్చిన వేధింపుల ఆరోపణలపై తన ఇష్టానుసారంగా తప్పుడు నివేదికను డీపీఎం సమర్పించారని ఆరోపించారు. సీసీలు నర్సింహారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దు'

ఇల్లెందు టౌన్, ఆగస్టు 12: ఇల్లెందు సింగరేణి జీకే ఫైవ్ ఓసీలో మంగళవారం ఉదయం నిర్వాసితులను తీసుకువచ్చి ఎంతో కాలంగా పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, మస్టర్ పడక ఇంటికి వెళ్లి పొమ్మని దౌర్జన్యం చేస్తున్న అధికారిక ప్రాతినిధ్యం సంఘం ఆగడాలను నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎఐటీయూసీ డిప్యూటి జనరల్ సెక్రటరీ సారయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులుషేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల పనుల ప్రారంభ దశ నుంచి రూ. 40నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను, నిర్వాసితుల పేరుతో వెళ్లగొట్టడం, పాత కార్మికుల పొట్ట కొట్టటడం అనే పద్ధతి మంచిపద్దతి కాదని దీని విరిమంచుకోవాలని, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని కాంట్రాక్టు కార్మికులకు, అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. సింగరేణి అధికారులు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ఈయూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌రావు డిమాండ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 27: టీజీఎస్ ఆర్టీసి రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కొత్తగూడెం డిపో జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు ఉద్యోగులు, కార్మికులు హాజరైనారు. ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కార్యదర్శి కందుల భాస్కర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 2013 ఆర్పీఎస్ బాండ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, అలెవెన్స్‌లను పెంచాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలన్నారు. మృతి చెందిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, కొత్తగూడెం డిపో ఈయూ నాయకులు ఆర్ఎన్.సింగ్, కె.ఎన్.బి.రావు, ఎన్ఎమ్‌యూ కార్యదర్శి పి.వరప్రసాద్, సాయికృష్ణన్, మహిళా కార్యకర్తలు డి. మాధవి, కె.రేణుకదేవి, తదితరులు పాల్గొన్నారు.



రైతులు దరఖాస్తు చేసుకోవాలి: కొత్వాల

పాల్వంచ రూరల్, ఆగస్టు 27 : ప్రభుత్వ నిబంధనలకు లోబడి రుణమాఫీ పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని డీసీఎంఎస్, రాష్ట్రమార్క్‌ఫెడ్ కమిటీ సభ్యులు చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. రుణమాఫీ పొందిన రైతులకు ఎటువంటి అభ్యంతరాలు తెలపవద్దని ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ లోపు రుణమాఫీ పొందని రైతులు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వ్యవసాయ, బ్యాంకు అధికారులు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించాలని, రుణమాఫీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మండల అధికారి శాంతి, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు కొండం వెంకన్న, నాయకులు వై. వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

రేపు నిరుద్యోగులకు జాబ్ మేళా

చుంచుపల్లి, ఆగస్టు 27: జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఈ నెల 29న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారమౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్, భారత్ మోటో కార్పోరేషన్ సంస్థల్లో పని చేయుటకు వంద మందిని భర్తీ చేసేందుకు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. వెల్డర్, ఫిట్టర్, సూపర్వైజర్స్ ట్రైనీ ఇంజనీర్స్, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్ పోస్టులకు ఐటిఐ, డిప్లమా మెకానికల్, బిటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని 18 నుండి 35 సంవత్సరాలలో వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.

కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం, ఆగస్టు 27: భట్టుపల్లి గ్రామానికి చెందిన కుంచం వినోద్ మెట్ల పనులు చేస్తుండగా మెట్టు కూలి కింద పడటంతో తీవ్ర గాయాలు అయిన సంఘటన కరకగూడెం మండలంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భట్టుపల్లిలోని ఓ ఇంటి స్లాప్ పనుల కోసం వినోద్ కూలికి వెళ్లాడు. అక్కడ మెట్ల పనులు చేస్తుండగా మెట్లు కూలి కింద పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని కరకగూడెం వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి 108 ద్వారా మణుగూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాల అందజేత

ఇల్లెందు టౌన్, ఆగస్టు 27: ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న రెగ్యూలర్ ఉద్యోగులకు 2023 సంవత్సరం వరకు తమ సీఎంపీఎఫ్ ఖాతాలో జమ అయిన డబ్బులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను సోమవారం జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజరు జాన్ ఆనంద్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సీఎంపీఎఫ్ డిపాజిట్ అయ్యేవిధంగా చూసుకోవాలని దీని వల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలని తెలిపారు. సీఎంపీఎఫ్ సీకేర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి ఉద్యోగి ముగింపు మొత్తానికి ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) మోహన్‌రావు, ఎస్‌సీ (వర్క్‌షాపు) నాగరాజునాయక్, ఇతర అధికారులు మహేష్, సాయి, స్వరూప్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పాల్వంచ, ఆగస్టు 27: షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం పాల్వంచ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహశీల్దార్ వివేక్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఉమర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి ఆంక్షలు లేకుండా అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత అనేక ఆంక్షలను తెరమీదకు తీసుకొచ్చిందని, దీంతో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే సందర్భంలో ఎలాంటి అంక్షలు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాత్రింబవళ్ళు కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని యావత్ ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నలు ఈ రోజు రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కుంజ కృష్ణ, కుంజా బూద్రా, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సోమ వినోద, వెంకటేశ్వర్లు, ఎర్రం శ్రీనివాస్, ఆరెంపుల రాజేష్, రూప్‌సింగ్, రమేష్, గోపి, రాఘవులు, భీమా, ఈదమ్మ పాల్గొన్నారు.

'డీపీఎంపై చర్యలు తీసుకోవాలి'

అశ్వాపురం, ఆగస్టు 27: క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు అందజేస్తున్న సెర్ప్ డీపీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల ఐకెపి ఎల్-1,ఎల్-2 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హజరయి నిరసన వ్యక్తం చేశారు. 1995 బైలాకు విరుద్ధంగా సిబ్బందిపై తప్పుడు నివేదికలు రూపొందిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ డీపీఎం వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. వాస్తవ సంఘటనలకు విరుద్ధంగా ఐకెపి సిబ్బందిపై తప్పుడు నివేదికలను ఇస్తున్న డీపీఎంపై చర్యలు తీసుకోవాలని ఈనెల 22న డీఆర్‌డీవోకు వినతిపత్రం అందజేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవటాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో విధులకు హజరయినట్లు సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఐకేపీ సీసీలు శోభారాణి, రాధారెడ్డి, కళావతి, రాంబాబు, వెంకటలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.